క్లుప్తంగా

బాలికలు ఉన్నతంగా చదువుకోవాలి



మల్లాపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మాట్లాడుతున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: బాలికలు ఉన్నతంగా చదువుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ ధనుంజయ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బాలికలకు బాల్య వివాహాలు, బాలల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత పౌష్టికాహారం, యోగా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు చిన్న వయస్సునుండి క్రమశిక్షణతో మెలగాలని ఉన్నత మైన చదువులు చదవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్ అరుణశ్రీ, బాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం



రాయదుర్గంలో మాట్లాడుతున్న సీడీపీవో పద్మావతి

రాయదుర్గంటౌన్:బాల్య వివాహాలతో బాలికల భవిష్యత్తు నాశనమవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఏఎల్ పద్మావతి తెలియజేశారు.శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల సమ్మర్ క్యాంపులు జరిగాయి. స్థానిక ఇందిరా బస్తి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని కిశోర బాలికలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ జూన్ 10 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం కిశోర బాలికలకు సమ్మర్ క్యాంపులు జరుగుతాయన్నారు. క్యాంపుకు కిశోర బాలికలందరూ హాజరుకావాలన్నారు. కిశోర బాలిలకులకు బాల్య వివాహాల వల్ల కలిగి నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ సరఫరా



పూలకుంటకు చేరుకున్న విత్తన వేరుశనగ

గుమ్మఘట్ట: సబ్సిడీ విత్తన వేరుశనగ మండలానికి చేరినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పూలకుంట, తాళ్లకెర రైతు సేవా కేంద్రాలకు 334 బస్తాల చొప్పున విత్తన వేరుశనగ వచ్చినట్లు ఆయన తెలిపారు. వీరాపురం, గలగల, భూపసముద్రం రైతు సేవా కేంద్రాలకు 100 క్వింటాళ్ల చొప్పున వేరుశనగ రానున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 9,120 హెక్టార్లు కాగా, 4,600 క్వింటాళ్ల విత్తన వేరుశనగకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినట్లు ఆయన తెలిపారు.

మార్పులు, చేర్పులపై ఆందోళనొద్దు

కూడేరు: రేషన్‌కార్డుకు దరఖాస్తు, పేర్లు మార్పు, చేర్పులు, తొలగింపులు, అడ్రస్ మార్పు చేసుకోవడానికి ఆందోళన పడాల్సిన అవసరం లేదని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి శుక్రవారం తెలిపారు. సచివాలయాల్లో దరఖాస్తు సమయంలో సర్వర్ డౌన్ కావడంతో కాస్త ఆలస్యమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మండలంలో 12,870 మంది రేషన్ కార్డుదారులుండగా, అందులో 37,199 మెంబర్లున్నారన్నారు. అందులో ఇప్పటికి 32,715 మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారని మిగిలిన 2,305 మంది ఈ నెలాఖరుకు చేయించుకోవాలన్నారు.లేదంటే రేషన్ రద్దవుతుందన్నారు.

లోపాలు సరిదిద్దేందుకే ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: పౌరసేవలు, సంక్షేమ పథకాలపై లోపాలు సరిదిద్దేందుకే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లుదేవనహళ్లి, తారకాపురం, బండూరు గ్రామాల్లో తహసీల్దార్ మునివేలు పర్యటించారు. బియ్యం పంపిణీపై ప్రజలతో మట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. డీలర్లు బియ్యం పంపిణీలో సమయపాలన పాటించలేదని ప్రజలు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వీఆర్ఓ శృతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుకు చిక్కులు

- అనేక నిబంధనలతో కార్డుదారులకు అవస్థలు
- మార్పులు, చేర్పులకు నతాయింపు
- సర్వర్ పనిచేయక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

రాయదుర్గం: కొత్త రేషన్‌కార్డుల కోసం కూటమి సర్కార్ విధించిన అనేక ఆంక్షలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు గుదిబండగా మారాయి. లబ్ధిదారులకు మొన్నటి వరకు వివాహ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. దానిపై పెద్దత్తున విమర్శలు వ్యక్తం కావడంతో సర్కార్ దిగొచ్చింది. వివాహక రిజిస్ట్రేషన్ ధృవ పత్రం లేకున్నా అప్‌లోడ్‌కు అవకాశం కల్పించింది. దీంతో పేదలపై పెను భారం తగ్గింది. అయితే అనేక ఆంక్షలతో పేదలు ఆబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 504 చౌక దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇప్పటి వరకు ఏఏవై 16,745, తెల్ల కార్డులు 1,84,770 మొత్తం 2,01,515 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా సుమారు 6,33,123 కేజీల బియ్యం సరఫరా అవుతోంది. కొత్తగా సుమారు 8 వేల మందికి పైగా కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. పాత కార్డుల్లోకి కొత్త పేర్ల నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు, స్ప్లిటింగ్ లాంటివి మరో 4 వేల దరఖాస్తులు అందినట్లు సమాచారం.



రాయదుర్గం పట్టణం పార్వతీనగర్‌లోని సచివాలయంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు ఇస్తున్న అర్జీదారులు

మ్యాపింగ్‌తో ఇబ్బంది

రేషన్‌కార్డు కోసం వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్‌లో ఉండాలి. తల్లిదండ్రులది ఓ చోట పిల్లలది మరోచోట ఉంటే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఎర్రర్ అని చూపుతుంది. ఇలాంటి సమస్యలతో చాలా మంది కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపకపోతే కొత్త కార్డులు మంజూరయ్యే అవకాం లేదు.

పది నిమిషాల్లోనే ఇచ్చేవారు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ/వార్డు సచివాలయాల్లోనే వివాహ ధ్రువీకరణ పత్రాలు పది నిమిషాల్లో ఇచ్చే వారు. ఈ-సైన్ విధానం లేక పోవడంతో ప్రజలు సులభంగా సర్టిఫికెట్ పొందే అవకాశం ఉండేది. తాజాగా కూటమి ప్రభుత్వ ఆంక్షలతో పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్హతలు ఉన్నవారందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రండి..ఆర్డీటీని కాపాడుకుందాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



కళ్యాణదుర్గం రూరల్: అనంత వరప్రదాయని ఆర్డీటీని కాపాడుకునేందుకు కలిసి రావాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ బెలుగుప్ప మండలంలోని గొంచితండా నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్డీటీ సేవలు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచేందుకు జూన్ 4న సాయంత్రం 4 గంటలకు గొంచితండా నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రలో జిల్లా , రాష్ట్ర స్థాయి పార్టీ నాయకులు పాల్గొని తమ పాతయాత్రకు సంఘీభావం తెలపాలని ఆయన కోరారు.

రోడ్లు గుంతలమయం..ప్రయాణం నరకం



నెరిమెట్ల - గాజుల మల్లాపురం వెళ్లే రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు



గాజులమల్లాపురం- వన్నళ్లికి వెళ్లే రోడ్డు మధ్యలో గుంతలు ఇలా..

ఉరవకొండ: పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలంటారు.. కానీ పల్లెలు ప్రగతి బాటలో నడవాలంటే.. 'బాట'లు కూడా బాగుండాలి. భారీ వర్షాలకు రోడ్లు మొత్తం ఛిద్రమయ్యాయి. చిన్న పాటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదాలకు గురికావడం ఖాయం. ఉరవకొండ నుంచి నెరిమెట్ల గ్రామం మీదుగా గాజుల మల్లాపురం, వన్నల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు పొడవునా అడుగుకో గుంత పడ్డాయి. వర్షపునీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. వారం రోజులుగా రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి.



మధుటాకీస్‌కు వెళ్లేదారిలో నిలిచి ఉన్న వర్షపునీరు

మురుగు కాలువలను తలపిస్తున్న వీధులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని చాలా చోట్ల చిన్నపాటి, మోస్తరు వర్షాలు కురిసినా రోడ్ల పైనే వర్షపునీరు నిలుస్తుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మధు టాకీస్‌కు వెళ్లే దారిలో వర్షపు నీరు నిలిచి, నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూరగాయల మార్కెట్ వెనుక ఓబుళాచారి రోడ్డు, ఆస్పత్రి పక్కన మల్లేశప్ప కాంప్లెక్స్ వీధిలోనూ వర్షపునీ నీరు నిలిచి ఉంది. శివారు కాలనీల్లో మట్టి రోడ్లు కావడం, డ్రైనేజీలు లేకపోవడంతో నీరు నిలిచి ఉంది. నాల్గో వార్డు పాత మీసేవా కేంద్రానికి వెళ్లే మార్గంలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షం వస్తే ఆ ప్రాంతంలో డ్రెయినేజీ నీటితో బురదగుంటగా మారుతోంది.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్



మాట్లాడుతున్న ప్రణయ్‌కుమార్‌రెడ్డి తదితరులు

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రణయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఉంటూ వైఎస్సార్ సీపీని పటిష్టం చేయాలని సూచించారు. సమావేశంలో వైఎస్సా ర్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, సర్పంచు మోనాలిసా, నియోజకవర్గ నాయకులు రాజేష్, గడేకల్లు భీమిరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, గ్రామకమిటీ అధ్యక్షుడు రవి కాంతరెడ్డి, యువజన విభాగం కార్యదర్శి ఎద్దాటి రమేష్, కిసాన్‌సెల్ కార్యదర్శి మహానందరెడ్డి, మాజీ ఏపీసీఎస్ చైర్మన్ ముష్టూరు రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రాగులపాడు మధు, పార్టీసీనియర్ నాయకులు కిష్టన్న, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

శుభకార్యం

వజ్రకరూరు: స్థానిక టీటీడీ కల్యాణ మంటపంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కె.భీమిరెడ్డి సోదరుడు రామలింగారెడ్డి, విమలమ్మ దంపతుల కుమారుడు నవనీత్‌రెడ్డి, బళ్లారి జిల్లా ఎర్రంగలికి చెందిన శిరీష, తిమ్మారెడ్డి దంపతుల కుమార్తె వైష్ణవి వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వై. శివ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.

వెటర్నరీ... సేవలు వర్రీ

- వెటర్నరీ ఆస్పత్రుల్లో సిబ్బందిలేక అందని సేవలు
- జీతాలిక్కడ... డ్యూటీలు అక్కడ
- డిప్యుటేషన్‌పై వెళ్లిన ఇద్దరు అధికారులు



కణేకల్లులోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రి

కణేకల్లు: కణేకల్లు ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో అధికారులు లేక పోవడంతో పశువైద్యసేవలు అందడంలేదు. ఏరియా వెటర్నరీ ఆసుత్రిలో ఉన్నది మూడు పోస్టులైతే.. ఇద్దరు అధికారులు ఇక్కడ పనిచేయలేక అనుకూలమైన చోటకు డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో పశువైద్యశాలలో అధికారులు, సిబ్బంది లేక పశువులకు వైద్యసేవలు అందక పాడిపోషకులు, రైతులు అవస్థలు పడుతున్నారు. వెటర్నరీ ఆసుపత్రిగా ఉన్న కణేకల్లు ఆసుపత్రిని కొన్నేళ్ల క్రితం అధికారులు అప్‌గ్రేడ్ చేసి, ఏరియా వెటర్నరీ ఆసుపత్రిగా మార్చారు. యర్రగుంట, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పశువైద్యశాలలతోపాటు సొల్లాపురం , గోవిందవాడలోని గ్రామీణ పశువైద్యశాలలను కణేకల్లు ఏరియా వెటర్నరీ ఆసుపత్రి పరిధిలోకి తెచ్చారు. కణేకల్లు ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో డాక్టర్ పోస్టును అప్‌గ్రేడ్ చేసి ఏడీఏను నియమించారు. మూడేళ్ల క్రితం బదిలీపై కణేకల్లు ఏడీఏగా వచ్చిన నాగార్జునబాబు ఇక్కడ పని చేయడం ఇష్టం లేక డిప్యుటేషన్‌పై సొంత జిల్లా ఒంగోలుకు వెళ్లిపోయారు. ఏడీఏ తర్వాత కీలకపోస్టు ఎల్ఎస్ఏ (లైవ్ స్టాక్ అసిస్టెంట్). ఇక్కడ ఎల్ఎస్ఏగా పని చేస్తున్న శివప్రసాద్ కూడా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు డిప్యుటేషన్‌పై వేయించుకొని వెళ్లారు. అటెండర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. కణేకల్లు ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో మూడు పోస్టులుంటే మూడు ఖాళీసే. ఏడీఏ, ఎల్ఎస్ఏ పోస్టులు.. అధికారుల లెక్కల్లో భర్తీ చేసినట్లే. వారు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఖాళీలుగా చూపించలేని పరిస్థితి. ఇక్కడ ఎవరూ లేకపోతే పశువైద్యశాల మూతేయాల్సి వస్తుందని సొల్లాపురంలోని రూరల్ వెటర్నరీ సెంటర్‌లోని వీఎల్ఓ (వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్) జీ.సత్యనారాయణను డిప్యుటేషన్‌పై ఇక్కడ నియమించారు. కీలకమైన ఏడీఏ లేక పోవడంతో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వెటర్నరీ ఆసుపత్రుల్లో అధికారులు, సిబ్బంది ఆడిందే ఆట... పాడిందే పాటగా మారింది.

ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళతారో..?

కణేకల్లు ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పనిచేయాల్సిన వీఎల్ఓ ఎప్పుడొస్తాడో? ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి అని ప్రజలు అంటున్నారు. ఒక్కోసారి ఆయన ఆరోగ్యం బాగా లేకనో, సెలవుపై వెళ్లినా పశువైద్యశాల మూత వేయాల్సిన పరిస్థితి. దీంతో కణేకల్లు సచివాలయాల ఏహెచ్ఏ (అనిమల్ హెల్త్ అసిస్టెంట్లు)లు ఎవరో ఒకరు వచ్చి కాలక్షేపం చేసి వెళ్లిపోతారు. ఏడీఏ నాగార్జునాబు, ఎల్ఎస్ఏ శివప్రసాద్‌లు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఈ పోస్టులు భర్తీగా ఉన్నట్లే లెక్క. వీరిని శాశ్వతంగా బదిలీలపై పంపించేస్తే కొత్తవారు రావడానికి అవకాశం ఉంటుంది.

బదిలీల్లో భర్తీ చేయిస్తాం

ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. డిప్యుటేషన్‌లు రద్దు చేయాలని అధికారులు కూడా నిర్ణయం తీసుకున్నారు. డిప్యుటేషన్‌లు రద్దు చేస్తే ఇక్కడున్న వారు మరో చోటికి వెళ్లొచ్చు. ఈ పోస్టుల్లో కొత్తవారు రావడానికి అవకాశం ఉంటుంది. బదిలీల్లో కొత్త వారిని నియమించి మెరుగైన పశువైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశులు, వెటర్నరీ డీడీ

ఘనంగా తిరంగా యాత్ర



తిరంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామ సచివాలయం వరకు తిరంగా యాత్ర ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్, మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్య దర్శి శాంతకుమార్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ దేవరాజ్, సీనియర్ నాయకులు చెక్కా సుబ్రమణ్యం , కోకన్వీనర్ ఆంజనేయులు, జిలా ప్రధాన కార్యదర్శి ఆదినారా యణ, మండల అధ్యక్షుడు గుడిసె పాతన్న పాల్గొన్నారు.

సీహెచ్ఓకు సన్మానం



సరోజమ్మను సన్మానిస్తున్న సిబ్బంది

శెట్టూరు: స్థానిక పీహెచ్‌సీలో పనిచేసే సీహెచ్ఓ సరోజమ్మను వైద్యాధికారి తరుణ్‌సాయి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. డాక్టర్ మాట్లాడుతూ సరోజమ్మ సీహెచ్ఓగా పదోన్నతిపై పదోన్నతి పొంది, చుక్కలూరు ప్రభుత్వాత్రికి బదిలీ కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు.

శృంగేరి పీఠాధిపతికి సత్కారం



రాయదుర్గం మీదుగా వెళ్తున్న విధుశేఖర భారతి స్వామిని దర్శించుకున్న భక్తులు

రాయదుర్గంటౌన్: విజయయాత్రలో భాగంగా అనంతపురం నుంచి కర్ణాటకలోని దావణగెరకు వెళ్తున్న శృంగేరి శారదాంబ పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతిస్వామిని శుక్రవారం సాయంత్రం భక్తులు కలిసి దర్శించుకున్నారు. పట్టణ శివారు అనంతపురం రహదారిలోని వైఎస్సార్ సర్కిల్‌లో బ్రాహ్మణ సంఘం సభ్యులు స్వామిని సత్కరించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

గోతిలోకి దూసుకెళ్లిన ఐచర్

వజ్రకరూరు: రాగులపాడు గ్రామ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న గోతిలో ఐచర్ వాహనం ఇరుక్కుంది. కర్ణాటకలోని చిత్రదుర్గ నుంచి ఐచర్ వాహనం గుంతకల్లు మీదుగా మంత్రాలయం బయల్దేరింది. మార్గంమధ్యలో వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న మట్టిపై ఐచర్ వాహనం దిగిపోయింది. ఎస్ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు.

విత్తన వేరుశనగ ఎప్పుడిస్తారో?

- సాగుకు సమయమవుతుండడంతో రైతుల్లో బెంగ
- పంపిణీకి చర్యలు చేపట్టని ప్రభుత్వం

కుందుర్పి: ప్రభుత్వం విత్తన వేరుశనగ ఎప్పుడిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే మే నెలలోనే విత్తన వేరుశనగ కాయలు అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జూన్ నెల వస్తున్నా.. ఇంకా సబ్సిడీ విత్తన కాయలు సరఫరాకు చర్యలు తీసుకోలేదని రైతులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారం రోజులుగా కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. ప్రభుత్వం మే మొదటి వారంలోనే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందించాల్సి ఉండగా, నేటికీ పట్టించుకోవడం లేదు. దీంతో సాగుకు సమయమవుతుండడంతో రైతులు క్వింటా వేరుశనగ విత్తనాలు రూ.13 వేలతో కర్ణాటక ప్రాంతంలోని చెళ్లకెర, వైఎన్‌హెచ్ కోట తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా ఐదు మండలాల్లో 800 ఎకరాల్లో రైతులు మెట్ట భూముల్లో రైతులు వేరుశనగ సాగు చేసినట్లు ఏడీఏ యల్లప్ప తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా ఖరీఫ్‌లో 1.12, లక్షల హెక్టార్లలో వేరుశనగ, కంది, ఆముదం, అలసంద, రాగి, కొర్ర పంటలు సాగు చేయనున్నారు.



కెంచంపల్లి సమీపంలో విత్తనం వేస్తున్న రైతులు